# ఫుడ్‌కోర్టు వ్యర్థాలతో దుర్వాసన

**ఆక్రమణలో భీమిలి రోడ్డులోని శిథిల డ్రైనేజీ**

**తగరపువలస :** స్థానిక అంబేడ్కర్ కూడలి నుంచి భీమిలి రోడ్డులో డ్రైనేజీని స్థానిక వ్యాపారులు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. కనీసం పారిశుద్ధ్య కార్మికులు చెత్త తీద్దామన్నా అవకాశం లేకుండా పోయింది. ఈ డ్రైనేజీ పురాతనమైనది కావడంతో ఆనవాళ్లు కూడా కోల్పోయింది. దీనికితోడు ఈ మార్గంలో ఇటీవల కొత్తగా వచ్చిన వ్యాపారాల కారణంగా మిగిలిన వ్యాపారులు తమ దుకాణాల్లో వ్యాపారాలు చేసుకోలేని పరిస్థితి దాపురించింది. దేవి ఫుడ్ కోర్టు నుంచి మిగిలిన ఆహార వ్యర్థాలను డ్రైనేజీలోకి వదులుతుండటంతో అవి గడ్డకట్టి దుర్వాసన వస్తోంది. ఆ వ్యర్థాలు డ్రైనేజీ నుంచి పల్లానికి పోతాయా అంటే... అక్కడే రత్న జ్యూయలర్స్ యాజమాన్యం ఇటీవల డ్రైనేజీని ఎత్తు చేసింది. దీంతో ఈ రెండు వ్యాపార దిగ్గజాల మధ్య రోడ్డుకు ఇరువైపులా చిరు వ్యాపారులు దుకాణాల్లో ఉండలేక సతమతమవుతున్నారు. డ్రైనేజీలో గడ్డకట్టిన వ్యర్థాల నుంచి వచ్చే దుర్వాసన కారణంగా తల తిరగడం, తలనొప్పి, వికారం, వాంతులు వంటి సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. ఆయా దుకాణాలకు వచ్చే వినియోగదారుల సంఖ్య కూడా దుర్వాసన కారణంగా తగ్గిపోయింది. పెద్ద వర్షం పడి డ్రైనేజీలోని వ్యర్థాలు కొట్టుకుపోతే తప్ప తమకు ఉపశమనం లభించడం లేదని వాపోతున్నారు. డ్రైనేజీపై ఆక్రమణలు తొలగించకపోతే పారిశుద్ధ్య పనులు నిర్వహించలేమని జీవీఎంసీ కార్మికులు వాపోతున్నారు.



భీమిలి రోడ్డులోని డ్రైనేజీలో పలుచోట్ల గడ్డకట్టిన ఫుడ్‌కోర్టు వ్యర్థాలు

**టౌన్ ప్లానింగ్ మొద్దునిద్ర**

తగరపువలస ప్రధాన రహదారితోపాటు భీమిలి రోడ్డుపై డ్రైనేజీలన్నీ దాదాపు ఏదో ఒక వ్యాపారి కబంధ హస్తాల్లో చిక్కి శల్యమైనవే కనిపిస్తాయి. దీంతో ఈ డ్రైనేజీలు మురుగునీటికి బదులుగా సీసాలు, ప్రైవేట్ మార్కెట్ నుంచి వచ్చిన కూరగాయల వ్యర్థాలు, పాలిథిన్ సంచులు, ఖాళీ కొబ్బరి బొండాలతో ఎప్పుడూ నిండి ఉంటాయి. దీంతో వర్షాలు కురిసినప్పుడు మాత్రమే జీవీఎంసీ ఈ డ్రైనేజీలను ఓపెన్ చేసి మురుగునీటి ప్రవాహానికి అడ్డంకులు తొలగిస్తుంది.

అదేవిధంగా భీమిలి రోడ్డులో దేవి ఫుడ్‌కోర్టు, రత్న జ్యూయలరీ వంటి పెద్ద యాజమాన్యాలు డ్రైనేజీలను ఆక్రమించినా టౌన్ ప్లానింగ్ విభాగం సంబంధం లేనట్లు వ్యవహరించడంతో మిగిలిన వ్యాపారులు అనారోగ్య సమస్యలను కొని తెచ్చుకుంటున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు మేలుకుని డ్రైనేజీలపై ఆక్రమణలు తొలగించి వ్యర్థాలు నిలిచిపోకుండా చూడాలని మిగిలిన వ్యాపారులు కోరుతున్నారు.

## ఉత్తమ సేవలు అందిస్తే గుర్తింపు

**పీఎం పాలెం :** విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా ఉత్తమ సేవలందించిన అధికారులను ఆదర్శంగా తీసుకోవాలని జీవీఎంసీ ఆరో వార్డులోని ఏపీఎస్‌పీఎఫ్ 16వ బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంట్ సీహెచ్‌వీఎస్ పద్మనాభ రాజు అన్నారు. బెటాలియన్‌లో పనిచేస్తూ ఈ నెల 30న రిటైర్ కానున్న ఏవో సీహెచ్ మేరీ ఉద్యోగ విరమణ వీడ్కోలు కార్యక్రమం శనివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మనాభ రాజు మాట్లాడుతూ నాణ్యమైన సేవలు అందించే అధికారులకు, సిబ్బందికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. అధికారుల ఆదేశాలు, సూచనలు అంకితభావంతో అమలు చేసే ఉద్యోగులకు అధిక ప్రాధాన్యత ఉంటుందన్నారు. అనంతరం ఏవో సీహెచ్ మేరీని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్లు సత్యనారాయణ, ఎస్.దేవానంద్, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.


ఏవో మేరీని సత్కరిస్తున్న ఇన్‌చార్జి కమాండెంట్ పద్మనాభరాజు, సిబ్బంది

## రూ.1.27 కోట్లకు వేములవలస డైలీ మార్కెట్ వేలం

**తగరపువలస :** ఆనందపురం మండలం వేములవలస మహాత్మాగాంధీ డైలీ మార్కెట్ వేలం పాటను శనివారం నిర్వహించగా 9 మాసాలకు వెన్ని శంకరరావు అనే వ్యక్తి సీల్డ్ కవర్ ద్వారా రూ.1,27,00,998 అధిక మొత్తానికి సొంతం చేసుకున్నాడు. జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు వేములవలస గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద తొలుత బహిరంగ వేలం నిర్వహించగా కోరాడ శ్రీనివాసరావు అనే వ్యక్తి రూ.1.07 కోట్లకు హెచ్చు పాటదారునిగా నిలిచాడు. ఈ బహిరంగ వేలంలో రూ.22 లక్షల వంతున డిపాజిట్ చెల్లించి నలుగురు వ్యక్తులు పాల్గొన్నారు. అనంతరం నలుగురు వ్యక్తులు దాఖలు చేసిన సీల్డ్ కవర్లను ఓపెన్ చేయగా వెన్ని శంకరరావు అధిక మొత్తానికి కోట్ చేయడంతో ఆయనకు పాట ఖరారు చేశారు. ఈ ఏడాది జూలై 1 నుంచి 2025 మార్చి 31 వరకు పాటదారుడు డైలీ మార్కెట్‌లో ఆశీలు వసూలు చేసుకునే వెసులుబాటు కల్పిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. పాటదారుడు అదనంగా 18 శాతం జీఎస్టీ చెల్లించాల్సి వుంటుంది. ఒక వేళ హెచ్చు పాటదారుడు వేలం పాటను రద్దు చేసుకోదలిస్తే గ్రామ పంచాయతీకి రూ.2 లక్షలు చెల్లించి రెండో హెచ్చు పాటదారునికి ఇవ్వాల్సి వుంటుంది. నామినేషన్లలో పాల్గొన్న పాటదారుల నుంచి 1 శాతం లేబర్‌సెస్ వసూలు చేయనున్నారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తరణ అధికారి రామారావు, తదితరులు పాల్గొన్నారు.


వేలం నిర్వహిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు, తదితరులు

## క్లుప్తంగా

### ఎమ్మెస్సీ కోర్సు మంజూరు

**భీమునిపట్నం :** భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొత్తగా ఎమ్మెస్సీ కోర్సు మంజూరైందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.విష్ణుమూర్తి శనివారం తెలిపారు. ప్రస్తుతం ఇక్కడ బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులు నిర్వహిస్తుండగా ఇప్పుడు 2024 - 2025 సంవత్సరానికి పీజీ కోర్సులో ఆర్గానిక్ కెమిస్ట్రీ ప్రవేశపెట్టడం జరిగిందని తెలిపారు. డిగ్రీలో ఉత్తీర్ణత సాధించి పీజీ సెట్ రాసి అందులో అర్హత పొందిన వారు ఈ కోర్సులో చేరడానికి అర్హులని తెలిపారు. ఆసక్తి గల వారు ఈ కోర్సులో చేరడానికి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

### లోక్ అదాలత్‌లో 204 కేసుల పరిష్కారం


లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జడ్జి సౌజన్య

**భీమునిపట్నం :** భీమిలిలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 204 కేసులు పరిష్కారమయ్యాయి. ఇక్కడి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయమూర్తి పి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో 135 కేసులు పరిష్కారమయ్యాయి. అలాగే ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయమూర్తి డి.సౌజన్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 69 కేసులు పరిష్కారమయ్యాయి. భీమిలి, ఆనందపురం, పద్మనాభం, పీఎం పాలెం పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసులు పరిష్కారమయ్యాయి. కార్యక్రమాల్లో భీమిలి న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు ఎంపీ పార్వతీశం, ప్రధాన కార్యదర్శి కేపీఎస్ఎం.సుధాకర్, కోశాధికారి ఎం.సునీల్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### జ్యూట్‌మిల్లు కార్మిక సంఘాలతో ఎమ్మెల్యే గంటా సమావేశం

**తగరపువలస:** చిట్టివలస జ్యూట్‌మిల్లు కార్మిక సంఘాలతో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శనివారం నగరంలోని ఆయన నివాసంలో సమావేశమయ్యారు. త్వరలో మిల్లు యజమాని బజోరియాను రప్పించి కార్మిక సంఘాలతో చర్చించి మిగిలిన సమస్యలను త్వరగా పరిష్కరించేలా చూస్తానన్నారు. సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు కొండపు ఈశ్వరరావు, అల్లు బాబూరావు, చిల్ల అప్పలస్వామి, త్రిమూర్తులు, సాడి అచ్చారావు, నరవ రామారావు, మునకాల ఆదినారాయణ, దల్లి అప్పలరెడ్డి, సరగడ ఈశ్వరరావు, ఎం.దేవుళ్లు, జీరు కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

### హోమ్ బేస్డ్ విద్య పరిశీలన


రెడ్డిపల్లిలో పరిశీలిస్తున్న ఎంఈవో రమణ

**పద్మనాభం :** మండలంలోని రెడ్డిపల్లిలో దివ్యాంగ విద్యార్థుల ఇళ్లకు ఎంఈవో పొన్నగంటి రమణ శనివారం వెళ్లి ప్రత్యేక ఉపాధ్యాయుడు ఎం.శ్రీనివాసరావు బోధిస్తున్న ఇంటి వద్ద విద్యను పరిశీలించారు. సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా ప్రత్యేక ఉపాధ్యాయులు దివ్యాంగ విద్యార్థుల ఇళ్లకు వారంలో శనివారం వెళ్లి విద్యను బోధిస్తారు. ఈ కార్యక్రమాన్ని ఎంఈవో పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులను భవిత కేంద్రాలకు పంపిస్తే సమగ్ర శిక్ష ద్వారా ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు.

### తిరుపతికి కుర్తాళం పీఠాధిపతి

**సీతంపేట:** లలితానగర్ శ్రీలలితా పీఠంలో గురువుల ఆరాధనోత్సవాలు శుక్రవారంతో ముగియడంతో శనివారం ఉదయం కుర్తాళం పీఠాధిపతి జగద్గురు సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి, శక్తి పీఠాధీశ్వరి మాతా రమ్యానంద భారతి స్వామిని తిరుపతికి పయనమయ్యారు. అక్కడ నుంచి వారణాశికి తరలివెళ్లి సిద్ధేశ్వరి పీఠంలో కొద్ది రోజుల పాటు స్వామీజీ వివిధ పూజా కార్యక్రమాల్లో పాల్గొంటారు.

## రైతు భరోసా కేంద్రాల్లో సబ్సిడీపై వరి విత్తనాలు


వేములవలస పంచాయతీ వద్ద రైతులకు వరి విత్తనాలు అందిస్తున్న అధికారులు


మద్ది రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ రాంబాబు

**తగరపువలస :** రైతు భరోసా కేంద్రాల ద్వారా 2024 ఖరీఫ్‌కు సంబంధించి రైతులకు సబ్సిడీపై వరి విత్తనాలు సరఫరా చేయనున్నట్టు ఆనందపురం మండలం వేములవలస సర్పంచ్ లంక కొండమ్మ, ఉప సర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ తెలిపారు. శనివారం పంచాయతీ కార్యాలయం వద్ద ఆయన రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీపై రైతులకు సాగు యంత్ర పరికరాలు అందించాలని కోరారు.

వ్యవసాయ సహాయకుడు షేక్ అహ్మద్ గౌస్ మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రంలో సాంబామసూరి, సోనామసూరి, ఎంటీయూ - 1121, ఆర్‌జీఎల్ 2537 రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరసింగరావు, మరుపల్లి సందీప్, రైతులు పాల్గొన్నారు.

**డీఏపీ ఎరువులు సిద్ధం చేయాలి**

**పద్మనాభం :** ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున డీఏపీ ఎరువులు సిద్ధం చేయాలని ఎంపీపీ కంటుబోతు రాంబాబు సూచించారు. మండలంలోని మద్ది రైతు భరోసా కేంద్రం వద్ద శనివారం ఆయన రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ఖరీఫ్‌లో రైతులకు ముందుగా డీఏపీ అవసరమన్నారు. ఈ ఎరువులను రప్పించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో శ్రీనివాసరావు, వీఏఏ రమ్య, వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

### ఆడదూడలతో పాడి రైతులకు లక్ష్మీకళ

**తగరపువలస:** పాడిరైతుల ఇంట ఆడ దూడ పెయ్యలు జన్మిస్తే లక్ష్మీకళ ఉట్టిపడినట్టేనని పశు సంవర్థక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. శనివారం రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో ఆడ దూడ పెయ్యల ఉత్పత్తి పథకాన్ని ఆనందపురంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంపిక చేసిన గ్రామాల్లో మేలుజాతి లింగ నిర్ధారిత వీర్యం ఉపయోగించడం వల్ల ఆడ పెయ్యలను ఉత్పత్తి చేసి పాల దిగుబడి పెంచవచ్చన్నారు. ఈ పథకం ద్వారా ఒక్కొక్క కృత్రిమ గర్భధారణకు రూ.675 చెల్లించాల్సి వుంటుందన్నారు. లింగనిర్ధారిత వీర్యనాళికలను రెండు సార్లు కృత్రిమ గర్భధారణకు సబ్సిడీపై అందించనున్నట్టు తెలిపారు. లింగ నిర్ధారిత వీర్యనాళికలలో ముర్రా, జెర్సీ, హెచ్ఎఫ్, జెర్సీ క్రాస్, హెచ్ఎఫ్ క్రాస్, గిర్, షాహివాల్ మొదలైనవి అందుబాటులో ఉంచుతామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.శ్రీనివాసరావు, మండల పశువైద్యాధికారి అనిల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

### ఘనంగా ఆలయ వార్షికోత్సవం


ఉత్సవ విగ్రహాల ఊరేగింపులో ఆలయ కమిటీ ప్రతినిధులు

**తగరపువలస :** జీవీఎంసీ రెండో వార్డు సంగివలస అల్లూరి సీతారామరాజు కాలనీలో శ్రీ సీతారామలక్ష్మణ, గణపతి, ఉమారామలింగేశ్వర, షిర్డీసాయి బాబా ఆలయ 19వ వార్షిక వేడుకలు శనివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, హోమాలు, భజనలు నిర్వహించారు. అనంతరం పల్లకీ సేవ, ఊయలసేవ, ప్రసాద వితరణ చేశారు. వేడుకల్లో ఆలయ కమిటీ అధ్యక్షుడు అక్కరమాని మంగరాజు, ఉపాధ్యక్షుడు వరహాలరెడ్డి, కమిటీ సభ్యులు బంగారురాజు, చిట్టిబాబు, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

**కొమ్మాది :** ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, వీటిపై అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ ప్రజలను చైతన్యవంతులను చేయాలని ఏఎంవో హెచ్.ఎస్.కిషోర్ సూచించారు. జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ, సాగర్‌నగర్, గుడ్లవానిపాలెం, రుషికొండ ప్రాంతాల్లో జ్వరాలు ఎక్కువగా ఉన్నందున మలేరియా విభాగం ఇన్‌స్పెక్టర్ మంగరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా అన్ని ప్రాంతాల్లోనూ మందులు పిచికారీ చేశారు. తడి చెత్తను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.


ఎండాడలో పిచికారీ చేస్తున్న సిబ్బంది

### రిటైర్డ్ టీచర్ జగదీష్‌కు సన్మానం

**పద్మనాభం :** మండలంలోని రెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎంగా పని చేసి పదవీ విరమణ పొందిన ఎస్.జగదీష్ దంపతులను శనివారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. జగదీష్ దంపతులను వైస్ ఎంపీపీ ఈర్ల రాజేశ్వరి, రెడ్డిపల్లి ఉప సర్పంచ్ సిరుగుడి ఆదినారాయణ దుశ్శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ జగదీష్ ఉపాధ్యాయునిగా అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈవో పి.రమణ, ఉపాధ్యాయ సంఘ నాయకులు ఆర్.జగదీష్‌బాబు, ఎ.అరుణ్ కుమార్, ఎస్.పద్దరాజు, ఎస్.నారాయణరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


జగదీష్ దంపతులను సన్మానిస్తున్న వైస్ ఎంపీపీ రాజేశ్వరి, ఆదినారాయణ

## పిల్లలు పనిలో కాదు.. బడిలో ఉండాలి


మారికవలసలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు


రెడ్డిపల్లిలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో గుర్తించిన పిల్లలతో ఎంఈవో రమణ, ఉపాధ్యాయులు

**మధురవాడ :** చదువుకునే పిల్లలు పనిలో కాకుండా బడిలో ఉండాలని మారికవలస మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు విజయ్‌కుమార్ అన్నారు. శనివారం మారికవలసలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యా ప్రవేశం కార్యక్రమంలో భాగంగా బడి ఈడు పిల్లలు బడిలో చేరాలని, అప్పుడే వారి భవిష్యత్ బాగుంటుందని ర్యాలీ నిర్వహించారు.

**రెడ్డిపల్లిలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్**

**పద్మనాభం :** బడి ఈడు పిల్లలందరూ బడిలో ఉండాలని ఎంఈవో పొన్నగంటి రమణ అన్నారు. మండలంలోని రెడ్డిపల్లిలో శనివారం విద్యా ప్రవేశ్‌లో భాగంగా ఉపాధ్యాయులతో కలిసి ఆయన ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ ఆరు నుంచి 14 ఏళ్ల లోపు పిల్లందరూ బడిలోనే ఉండాలని తెలిపారు. తల్లిదండ్రులు ఈ వయస్సు గల పిల్లలను పనులకు పంపకూడదన్నారు. ఈ సందర్భంగా ఐదేళ్లు దాటిన ఇద్దరు పిల్లలను గుర్తించి రెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ఈశ్వరరావు, సీఆర్‌పీ ఎం.బంగారునాయుడు, ప్రత్యేక ఉపాధ్యాయుడు ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## గుడివాడ అప్రోచ్ రోడ్డులో తుప్పల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

**తగరపువలస :** జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు గుడివాడ అప్రోచ్‌రోడ్డు పరిసరాల్లో శానిటేషన్ విభాగం ఆధ్వర్యంలో బాబ్‌కాట్‌తో శనివారం తుప్పలు తొలగించారు. ఈ ప్రాంతంలో ఖాళీ స్థలాలు ఎక్కువగా ఉన్నందున తుప్పలు పెరిగిపోవడంతో సమీపంలోని విద్యాసంస్థల్లోకి విష పురుగులు ప్రవేశిస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. దీనిపై 'విష పురుగుల సంచారంతో ఆందోళన' శీర్షికతో ఈ నెల 20న సాక్షిలో వార్త ప్రచురించిన సంగతి తెలిసిందే. వర్షాలు కురిస్తే మరింతగా తుప్పలు పెరిగే అవకాశం ఉన్నందున శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.మహాలక్ష్మినాయుడు స్పందించి తుప్పలు తొలగించి శుభ్రం చేసేలా చర్యలు తీసుకున్నారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


తుప్పలు తొలగించిన తర్వాత అప్రోచ్‌రోడ్డు

## తీరంలో ఇసుక దొంగలు

**కొమ్మాది :** భీమిలి బీచ్ రోడ్డులోని పలు తీర ప్రాంతాల్లో ఇసుక దొంగలు బరితెగిస్తున్నారు. అర్ధరాత్రి సమయాల్లో మంగమారిపేట, తిమ్మాపురం, రుషికొండ తీరాల వద్ద అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. ఈ బీచ్ ఇసుకను గెడ్డ ఇసుకతో కలిపి కల్తీ చేసి వ్యాపారం చేస్తున్నారు. తీర ప్రాంతాల్లో పెద్దఎత్తున్న ఇసుక మాఫియా జరుగుతోందని, దీనిపై నిర్లక్ష్యం వహిస్తే భవిష్యత్‌లో పెను ప్రమాదమే ముంచి ఉంటుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఈ ప్రాంతాల్లో పెద్ద గోతులు ఏర్పడడంతో తీరం కోతకు గురవుతోంది. ఇక్కడ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి తీర ప్రాంతాలను సంరక్షించే బాధ్యతను అధికారులు తక్షణమే తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


ఇసుక తరలించడంతో కోతకు గురైన తీరం

## ప్రమాదకరంగా గొయ్యి

**కొమ్మాది :** బీచ్ రోడ్డు రుషికొండ ఐటీ జంక్షన్ రోడ్డు వద్ద ఇటీవల కురిసిన వర్షాలకు పెద్ద గొయ్యి ఏర్పడింది. దీనివల్ల రాత్రి సమయాల్లో ప్రమాదం పొంచి ఉందని పలువురు ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రాంతంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని, తక్షణమే గొయ్యి పూడ్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


రోడ్డు పక్కనే ఏర్పడిన గొయ్యి

# నేత్రపర్వం.. అప్పన్న నిత్యకల్యాణం

**సింహాచలం:** శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు కనులపండువగా జరిగాయి. అందులో భాగంగా ఉదయం 9.30గంటల నుంచి నిత్యకల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణమండపంలో వేదికపై అధిష్ఠింపజేశారు.

అనంతరం విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్య ధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు, అక్షింతలను అందజేశారు.

**ఘనంగా సహస్ర నామార్చన**

శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి శనివారం సహస్ర నామార్చన ఘనంగా జరిగింది. ఉత్సవ మూర్తులు గోవింద రాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణమండపంలో వేదికపై కొలువుదీర్చి, 1001నామాలను పఠిస్తూ స్వామి వారికి అర్చన చేశారు. ఉభయదాతలకు స్వామివారి తులసి ప్రసాదం అందజేశారు.


నిత్యకల్యాణంలో తలంబ్రాలు ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

## కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించాలి

**మహారాణిపేట:** కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. శనివారం తన కార్యాలయంలో ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. మొదటి విడతగా 73 కేసులను గుర్తించామన్నారు. కుష్టువ్యాధి నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు.

క్షేత్రస్థాయి సిబ్బందిని వినియోగించుకుని కచ్చితమైన కేసులను గుర్తించాలన్నారు. జిల్లా లెప్రసీ, టీబీ, ఎయిడ్స్ నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు కుష్టువ్యాధిపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. ఆశ కార్యకర్తలు, వలంటీర్ల ద్వారా పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె.సత్యవేణి, నోడల్ అధికారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా స్కూల్ వార్షికోత్సవం

**తగరపువలస :** జీవీఎంసీ ఒకటో వార్డు బంగ్లామెట్ట ఇన్‌క్రెడిబుల్ ప్లే స్కూల్ మొదటి వార్షిక వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో కరస్పాండెంట్ బోగెల కృష్ణ, ప్రిన్సిపాల్ వాండ్రాసి సతీష్ మాట్లాడుతూ కార్మికవాడ ప్రజలకు నాణ్యమైన విద్యతోపాటు పరిశుభ్రమైన వాతావరణంలో ఏసీ తరగతి గదులు ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా కళాకారుడు నాయుడుతో ఏర్పాటు చేసిన మిమిక్రీ చిన్నారులను ఆకట్టుకుంది. అనంతరం చిన్నారులతో కేక్ కట్ చేయించి జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినులు కోమలి, సౌజన్య, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మతిస్థిమితం లేని మహిళకు సాయం

**భీమునిపట్నం:** భీమిలిలో మతిస్థిమితం లేని మహిళకు సాయం చేయడానికి ఓఎస్‌జీ, ఏఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ సభ్యులు ముందుకొచ్చారు. నేరెళ్లవలస కాలనీలో మాదాబత్తుల విజయలక్ష్మి అనే మహిళ కొంత కాలంగా మతిస్థిమితం లేకుండా పరిసర ప్రాంతాల్లో ఉంటోంది. ఆమెకు ఆరోగ్యం సరిగ్గా లేకపోవడంతో ఫౌండేషన్ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా వారు మెరుగైన చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించాలని సూచించారు. ఈమెను తాము కేజీహెచ్‌కు తీసుకెళ్లి వైద్యం చేయిస్తామని ఫౌండేషన్ సభ్యులు గండాసి అరవింద్, శివ దశాయి, తేజ తెలిపారు.